క్లుప్తంగా

ప్రకృతిసిద్ధ ఆహారంతోనే ఆరోగ్యం



నర్సిపూడిలో ప్రకృతి సిద్ధ పంట ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న రైతులు, ప్రతినిధులు

ఆలమూరు: క్రిమి సంహారక మందులు, రసాయన ఎరువులు లేకుండా ప్రకృతిసిద్ధంగా పండించిన ఆహార ఉత్పత్తులతోనే మెరుగైన ఆరోగ్యం సాధ్యమని రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధుల బృందం తెలిపింది. నర్సిపూడిలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు జరిగింది. శిబిరంలో ప్రకృతి సిద్ధమైన ఆహార ఉత్పత్తులను ప్రదర్శించారు. క్రిమి సంహారక మందులు లేకుండా ఆహార ఉత్పత్తులను పండించవలసిన విధానాన్ని వివరించారు. మండల ప్రకృతి వ్యవసాయశాఖ ప్రతినిధి ఎస్‌ఎఫ్‌కె సూర్యప్రకాష్, ఎం.శ్రీనివాస్, తోరాటి నాగమహేశ్వరరావు, నాగబాబు, నాగసూర్యావతి, కె.జ్యోతి, రేలంగి రాజ్యం, జిల్లా మోడల్ మేకర్స్ పి.మంజుల, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారికి వెండి సమర్పణ



నూకాంబిక అమ్మవారి ఆలయంలో వెండిని సమర్పిస్తున్న భక్తులు

ఆలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మవారికి మంగళవారం సుమారు రూ.25 విలువైన వెండి సమర్పణ జరిగింది. ఇటీవల భక్తులు అమ్మవారికి రూపొందిస్తున్న రజత ఆభరణాల తయారీలో భాగంగా ఆలమూరుకు చెందిన నెక్కంటి శ్రీనివాసులు, పద్మావతి దంపతులు ఈ వెండిని ఆలయ ఆవరణలో సమర్పించారు. అమ్మవారి రజత ఆభరణాల రూపకల్పనలో ఈ వెండిని వినియోగించనున్నట్లు ఆభరణాలయ తయారీ చేయిస్తున్న గ్రామ మహిళ భక్త బృంద సభ్యులు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా ఆవశ్యకతను వివరిస్తున్న ఐసీడీఎస్, విద్యాశాఖ ప్రతినిధులు

ఆలమూరు: యోగా నేర్చుకోవడం ద్వారా మహిళలు సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.గజలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని ఐసీడీఎస్, విద్యాశాఖ ఆధ్వర్యంలో పలు వినూత్న కార్యక్రమాలు జరిగాయి. మహిళా దినోత్సవం మూడో రోజైన మంగళవారం ఆయా అంగన్‌వాడీలు, పాఠశాలల్లో యోగా ఆవశ్యకతను వివరించారు. మహిళల అభ్యున్నతి కోసం తీసుకోవలసిన చర్యలను సూపర్‌వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, వై.అరుంధతి వివరించారు.

మహిళల రక్షణపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి



కొత్తపేటలో వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న ఎస్సై తదితరులు

కొత్తపేట: మహిళల రక్షణలో పోలీసు రక్షణశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తుందని కొత్తపేట ఎస్సై వి.సురేంద్ర అన్నారు. స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసుశాఖ, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు జరిగాయి. మహిళల రక్షణలో పోలీసుల పాత్ర అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 61 మంది డిగ్రీ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ కనబర్చారు. ప్రిన్సిపాల్ కేపీ రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎస్సై సురేంద్ర పాల్గొని ప్రసంగించారు. మహిళల రక్షణ కోసం దిశ తదితర చట్టాలను ప్రవేశపెట్టిందన్నారు. హెచ్‌ఓడీ కె.సత్యనారాయణ, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కన్వీనర్ సీహెచ్‌ఎన్ రాణి, అధ్యాపకులు దీపికాదేవి, వి.నాగదీపిక, కె.సుకృతవల్లి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

అంబాజీపేట: భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భవ దినోత్సవాన్ని మాచవరం శివారు పోతాయిలంకలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బీకేఎస్ భవనంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల జమ్మీల్ ఆధ్వర్యంలో బీకేఎస్ ఆవిర్భావ వేడుకలను జరిపారు. బలరాముడు విగ్రహం వద్ద నినాదాలు చేశారు. కార్యక్రమంలో ముత్యాల సత్తిబాబు, బాబూరావు, నందెపు ఏసు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా తాగునీటి ప్రాజెక్ట్ పనులు

- మాజీ సీఎం జగన్ చొరవతో దాహార్తికి చెక్
- జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా మంజూరైన పథకం

సఖినేటిపల్లి: సముద్ర తీరప్రాంత గ్రామాల్లో ప్రజల దాహార్తికి చెక్ పెట్టే విధంగా జల్‌జీవన్ మిషన్ పథకంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన సమగ్ర రక్షిత తాగునీటి పథకం పనులు వేసవి నాటికి పూర్తి చేసేలా అడుగులు పడుతున్నాయి. ఈ బృహత్తర తాగునీటి పథకం పనులు త్వరితగతిన పూర్తి చేసేలా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసింది. మాజీ సీఎం వైఎస్ జగన్ చూపిన చొరవతో అంతర్వేది దేవస్థానంలో ఉన్న 12 ఎకరాల చెరువును అధికారులు జేజేఎంలో రూ.17.33 కోట్లతో నాడు సమగ్ర రక్షిత తాగునీటి ప్రాజెక్ట్‌గా రూపకల్పనకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో 2023 జూన్ నెల నుంచి ప్రాజెక్ట్ పనులను యుద్ధప్రాతిపదికన ఆ శాఖ అధికారులు చేపట్టారు.

20 ఏళ్ల భవిష్యత్ అవసరాల కోసం

తీరంలో ప్రతి ఇంటికీ అవసరమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో 20 ఏళ్ల భవిష్యత్ అవసరాల దృష్టిలో ఉంచుకుని జల్‌జీవన్ మిషన్‌కు నాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాంది పలికాయి. ప్రభుత్వాలు సమాన భాగస్వామ్యంతో జేజేఎం కింద చేపట్టిన ఈ పథకం తీరప్రాంత ప్రజలకు చిరకాలంగా ఉన్న దాహార్తి సమస్యకు పరిష్కారం ఇవ్వనుంది. తీరంలో అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం, గొంది గ్రామాల్లోని 13 ఆవాసాల్లోని సుమారు 30 వేల మంది జనాభాకు రక్షిత తాగునీరు సరఫరా చేయడమే ఈ పథకం లక్ష్యం.



చెరువు వద్ద నిర్మాణంలో ఉన్న భారీ సంపు



అంతర్వేది చెరువులో దాదాపుగా పూర్తయిన నల్లరేగడి బెడ్ కార్పెట్


నీటిని నిల్వకు తగ్గట్టుగా రిటెయినింగ్ వాల్

చెరువు చుట్టూ 4 మీటర్లు ఎత్తులో రిటెయినింగ్ వాల్ నిర్మాణం పనులు పూర్తి చేశారు. చెరువు పొడవు 220 మీటర్లు, వెడల్పు 180 మీటర్లు ఏర్పాటు చేసిన ఈ చెరువులో ఒక లక్షా 34 వేల 640 క్యూబిక్ మీటర్లు ఘనపరిమాణంలో నీటిని నిల్వచేసే దిశగా రిటెయినింగ్ వాల్ నిర్మాణం జరిగింది.

పూర్తి కావచ్చిన బెడ్ కార్పెట్ పనులు

చెరువులో నిల్వ చేసే నీరు ఇంకిపోకుండా ఉండేందుకు, ఉప్పునీరు పైకి పోటెత్తకుండా ఉండేందుకు బెడ్ కార్పెట్‌గా 70 సెంటీమీటర్లు ఎత్తులో నల్లరేగడిని వేసే పనులు పూర్తి కావచ్చాయి. పి.గన్నవరం ప్రధాన పంట కాలువ ద్వారా ప్రాజెక్ట్‌కు నీటిని పంపింగ్ చేయడానికి ఇన్‌టేక్ వెల్ నిర్మాణం పనులను సఖినేటిపల్లి మూడుతూములు సెంటర్ వద్ద ఆ శాఖ అధికారులు చేపట్టారు. ఇన్‌టేక్ వెల్ నుంచి నీటి సరఫరాకై ప్రాజెక్ట్ వరకూ 12 కిలోమీటర్లు మేర తగిన పైపు లైను నిర్మాణం కూడా ఆ శాఖ పూర్తి చేసింది. ప్రాజెక్ట్‌కు సమీపంలో 30 మీటర్లు ఎత్తులో 60 వేల లీటర్లు కెపాసిటి గల ఓహెచ్‌బీఆర్ ట్యాంకు నిర్మాణం దాదాపుగా పూర్తి కావస్తోంది. అలాగే నిర్మాణంలో ఉన్న 3 ఎంఎల్‌డి ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ ద్వారా రోజుకు 3 మిలియన్ల లీటర్ల నీటిని శుద్ధి చేసే ప్రక్రియ జరుగనుంది. దీంతో పాటు సమీపంలో నిర్మించనున్న 250 కిలోలీటర్ల కెపాసిటీ సంపు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శుద్ధి చేసిన నీటిని ఈ సంపులో నిల్వ చేసి, ట్యాప్‌ల ద్వారా సరఫరా చేయనున్నారు.

> **సరిపడా తాగునీరు**
>
> జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికీ సరిపడా తాగునీరు ఇవ్వాలన్నదే పథకం లక్ష్యం. వేగంగా ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసే విధంగా కృషి చేస్తున్నాం. పథకం పనులు ఏప్రిల్ నాటికి పూర్తి చేసేలా, తదనంతరం కాలంలో కాలువలకు నీరందించిన తరువాత ప్రజలకు తాగునీరు అందించేలా చూస్తాం.
>
> – కె.లక్ష్మీశిరీష, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, సఖినేటిపల్లి



అంతర్వేది చెరువు వద్ద పూర్తి కావస్తున్న ఓహెచ్‌బీఆర్ ట్యాంకు

వాహనాలకు వేలం

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఈ నెల 10న బహిరంగ వేలం నిర్వహించనున్నారు ఆలమూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఐడీ నాగేశ్వరరావు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం కాకినాడలోని ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు మార్చి 10న ఉదయం 11 గంటలకు సీజ్ చేసిన వివిధ వాహనాలను వేలం నిర్వహించనున్నారు. వేలంలో పాల్గొనదలచిన ఆశావహులు వ్యక్తిగతమైన గుర్తింపు కార్డుతో పాటు రూ.రెండు వేలు రుసుం చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. వేలంలో వాహనం దక్కించుకున్న వారు వాహనం ధరతో పాటు 18 శాతం మేర జీఎస్టీ చెల్లించి తీసుకువెళ్లాలి. వేలం రద్దు చేయడం గాని వాయిదా వేయడం గానీ పూర్తి అధికారాలు ఎక్సైజ్ శాఖకు చెంది ఉంటాయని సీఐ పేర్కొన్నారు.

పౌష్టికాహారంపై బాలికలు దృష్టి కేంద్రీకరించాలి

అంబాజీపేట: కౌమార దశలో ఉన్న బాలికలు పౌష్టికాహారంపై దృష్టి కేంద్రీకరించేలా అవగాహన కల్పించాలని వైద్యాధికారి కేఎస్ శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీలో సీహెచ్‌ఓ బి.అప్పారావు అధ్యక్షతన ఏఎన్‌ఎంలు, ఆశాలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కౌమార దశలో పోషకాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత సమతులంగా ఉంటుందన్నారు. బాలికలను విద్యకు ప్రోత్సహించేలా వారి తల్లిదండ్రులను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



అంబాజీపేటలో నిరసన తెలుపుతున్న సమగ్ర ఉద్యోగులు



మామిడికుదురులో నిరసన తెలుపుతున్న జేఏసీ ఉద్యోగులు

అంబాజీపేట: ఏపీ సమగ్రశిక్షలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వహిస్తున్న వారిని రెగ్యులర్ చేయాలంటూ కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు, సీఆర్‌ఎంటీ, ఐఈఆర్టీలు, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఎంఆర్సీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబాజీపేట మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, మినిమం టైం స్కేల్ వర్తించే విధంగా జీఓ నెం.2ను రద్దు చేయాలన్నారు. నిరసనలో సమగ్ర ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్లకార్డులతో సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

మామిడికుదురు: జీఓ నంబర్-2ను రద్దు చేసి, ఎంటీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు మామిడికుదురులో మంగళవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. మామిడికుదురు ఎమ్మార్సీ కార్యాలయం వద్ద రాష్ట్ర సమగ్ర శిక్ష జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగులు ఈ నిరసన నిర్వహించారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయసు 62కు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. ఈ నిరసనలో జేఏసీ నాయకులు నైనాల రాజేంద్ర ప్రసాద్, జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాస్, మండల జేఏసీ అధ్యక్షులు జి.రామకృష్ణ, ఐఈఆర్‌టీ నాయకులు హిమబిందు, మెహదీ, ఫణి, లక్కింశెట్టి శ్రీనివాస్, జి.లక్ష్మీనారాయణ, సుశీల పాల్గొన్నారు.

రాష్ట్రంలో దుర్మార్గ పాలన రాజ్యమేలుతోంది



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

మామిడికుదురు: రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన రాజ్యమేలుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, పి.గన్నవరం కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదపట్నంలంకలో మంగళవారం పార్టీ మండలశాఖ అధ్యక్షులు కొమ్ముల రాము అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించిన సినీ నటుడు పోసాని కృష్ణమురళిని కూటమి ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. అతనిపై తప్పుడు కేసులు పెట్టి చిత్రహింసలకు గురి చేస్తున్నారన్నారు. దళిత ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ తీసుకున్న చర్య ముమ్మాటికీ కక్ష సాధింపేనని కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. దళిత ఉద్యోగులను కూటమి ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తుందన్నారు. ప్రభుత్వ చర్యలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు నెల్లి దుర్గాప్రసాద్, నీతిపూడి గణేష్‌బాబు, మందపాటి కిరణ్‌కుమార్, దొమ్మేటి సత్యమోహన్, తోరం గౌతమ్, వాసంశెట్టి తాతాజీ, జక్కంపూడి వాసు, తోరం భాస్కర్, గెద్దం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలి

అంబాజీపేట: మండలంలో ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. ముక్కామల రైతు సేవా కేంద్రం వద్ద రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవడం వల్ల రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, యంత్ర పరికరాల రాయితీలకు ఉపయోగపడుతుందన్నారు. 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య లేని వారికి ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు. మండలంలో 6046 మంది రైతులకు గాను 4,988 మంది నమోదు చేయించుకున్నారన్నారు. త్వరితగతిన మిగిలిన రైతులు ఆయా గ్రామాల్లో ఉన్న వీఏఏలు, వీహెచ్‌ఏలను సంప్రదించాలన్నారు. రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకనే సమయంలో మూడు సార్లు ఓటీపీలు వస్తాయని, మొబైల్ కూడా తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు డి.దుర్గారావు, పి.జాబేజ్‌శాస్త్రి, వీఏఏలు సౌజన్య, నరేంద్ర, కిరణ్‌దుర్గ, వీహెచ్‌ఏ లక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి



మలికిపురంలో పార్టీ శ్రేణులతో సమావేశమైన మాజీ మంత్రి సూర్యారావు

మలికిపురం: వైఎస్సార్ సీపీ శ్రేణులు, పార్టీ అనుబంధ సంఘాలన్నీ సమన్వయంతో పని చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు సూచించారు. మంగళవారం మలికిపురంలోని పార్టీ కార్యాలయంలో యువజన విభాగాల కమిటీల ఏర్పాటుపై జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ పదవులను అలంకారంగా కాకుండా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకంతో తాను పని చేస్తున్నానని, కార్యకర్తలను కూడా తాను అలాగే నమ్మి ముందుకు సాగుతానన్నారు. నియోజకవర్గంలో పార్టీ ముందు అనేక సవాళ్లు ఉన్నాయని వాటిని అధిగమించి ముందుకు సాగుతూ కూటమి అరాచకాలను ఎదుర్కోవాలని సూచించారు. అనంతరం యువజన విభాగాల కమిటీలను పరిచయం చేశారు. సమావేశంలో జాన శంకరరావు, పాటి శివకుమార్, కుసుమ చంద్రశేఖర్, కటకంశెట్టి ఆదిత్యకుమార్, అడబాల వీరబ్రహ్మాజీరావు, కట్టా శ్రీనివాసరావు, బొలిశెట్టి భగవాన్, ఈద రవిరెడ్డి, దొంగ నాగ సత్యనారాయణ, తోటె జాన్ బాబు, గుర్రం జాషువా, తదితరులు పాల్గొన్నారు.

వంతులవారీ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట/కొత్తపేట: ముక్కామల లాకులపై ఉన్న కాలువలకు బుధవారం ఉదయం 6 నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు 24 గంటల పాటు వంతుల వారీగా సాగు నీరు అందించనున్నట్లు కొత్తపేట అసిస్టెంట్ ఇంజినీర్ మంగళవారం తెలిపారు. మోడేకుర్రు, నేదునూరు, ముక్కామల, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, కె.పెదపూడి, గంగలకుర్రు, మొసలపల్లి, ఎస్.సావరం, బిళ్లకుర్రు, వక్కలంక రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. అలాగే అయినవిల్లి మండలంలోని చింతనలంక లాకులపై ఉన్న కాలువలకు బుధవారం ఉదయం 6 గంటల నుంచి శుక్రవారం ఉదయం 6 గంటల వరకు 48 గంటల పాటు వంతుల వారీగా సాగు నీరు అందిస్తున్నామన్నారు. మడుపల్లి, వెలవలపల్లి, పసుపల్లి, వానపల్లి, నేదునూరు, చింతనలంక, బిళ్లకుర్రు, గ్రామాల రైతులు సాగు నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో రఘురామ్

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామిని బీజేపీ జాతీయ నాయకుడు పి.రఘురామ్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి విశేష పూజలు జరిపారు. ఆయన వెంట బీజేపీ నాయకులు కె.రామచంద్రమూర్తి, యనమదల వెంకటరమణ తదితరులు ఉన్నారు.

హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

ఆలమూరు: ప్రభుత్వ, ప్రైవేటు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరూ తమ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి, జిల్లా ఆశ కార్యకర్తల సమాఖ్య అధ్యక్షురాలు కె.కృష్ణవేణి అన్నారు. మండలంలోని పెదపళ్లలో మంగళవారం పలు శాఖలకు చెందిన ఉద్యోగులు, సిబ్బందితో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఉద్యోగులకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ఆమె వివరించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు వేతనాలు పెంచలేదని ఆవేదన చెందారు. అలాగే గ్రామ సచివాలయాల్లో మహిళ ఆరోగ్య సంరక్షణ కార్యదర్శులకు పనిభారం పెరిగిపోయిందన్నారు. దీనిపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ద్వారానే హక్కుల సాధ్యమని ఆమె పేర్కొన్నారు. ఈనెల ఆరున ఆశ కార్యకర్తలందరూ చలో విజయవాడకు తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు.

కలశ స్థాపనతో సప్తాహం ప్రారంభం

మామిడికుదురు: పెదపట్నంలంక బొక్కావారిపాలెంలో మంగళవారం సీతాసమేత పట్టాభిరామ అఖండ రామనామ సర్వనామ షష్ఠమ సప్తాహం ఘనంగా ప్రారంభమైంది. అశ్వని నక్షత్రయుక్త కుంభలగ్నంలో ఉదయం 6.25 గంటలకు కంచి నీలకంఠంగురుమూర్తి, నాగలక్ష్మి దంపతుల ఉత్సవాలకు కలశ స్థాపన చేశారు. దీనిలో భాగంగా శ్రీరామ నామ సర్వనామ కీర్తనలతో భజన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అర్చకులు గాడేపల్లి సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 11వ తేదీ వరకు ఈ సప్తాహం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

సర్వేల నుంచి విముక్తి కలిగించండి



తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రాన్ని అందిస్తున్న ఏఎన్‌ఎంలు

రాజోలు: గ్రామ సచివాలయ ఏఎన్‌ఎంలను సర్వేల నుంచి విముక్తి కలిగించాలని, ఏదో ఒక డిపార్ట్‌మెంట్ ద్వారా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి ఫణికిరణ్‌కు ఏఎన్‌ఎంలు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామ సచివాలయం డిపార్ట్‌మెంట్‌తో పాటు, హెల్త్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఏకకాలంలో వివిధ రకాల డ్యూటీలు వేసి పని భారం పెంచుతున్నారన్నారు. సచివాలయ పరిధిలో సర్వేలు నిర్వహించాలని లేకపోతే జీతాలు కట్ చేస్తామని మండల పరిషత్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. ఒక డిపార్ట్‌మెంట్ ద్వారా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారికి విజ్ఞప్తి చేశారు. అంతవరకు సచివాలయం విధులు మాత్రమే నిర్వహిస్తామని దానికి పీహెచ్‌సీ వైద్యులు, సూపర్‌వైజర్లు తమకు సహకరించాలని కోరారు.

వీరవల్లిపాలెంలో బౌద్ధ భిక్షువు పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న బౌద్ధ భిక్షువు బోధిహీన్

అయినవిల్లి: శ్రీలంక నుంచి తెలుగు రాష్ట్రాల పర్యటనలో భాగంగా బౌద్ధ భిక్షువు బోధిహీన్ మంగళవారం వీరవల్లిపాలెం చేరుకున్నారు. పర్యటనలో భాగంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ ఆంధ్ర ప్రజలు దయ, దాతృత్వంతో తులతూగుతున్నారన్నారు. అన్నదానంలో తెలుగు రాష్ట్రాలు ముందుంటాయన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలన్నారు. ఏపీలోని అమరావతికి బౌద్ధ భిక్షువులు రావడానికి ఇష్టపడుతున్నారన్నారు. సనాతన ధర్మంలో బౌద్ధ ధర్మం కూడా మూలధర్మమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బౌద్ధ ధర్మం ఆనవాళ్లు కోకొల్లలుగా ఉన్నాయన్నారు. రాష్ట్రప్రభుత్వం బౌద్ధ స్థూపాల వద్ద కనీస వసతులు కల్పించాలన్నారు. ముఖ్యంగా సనాతుడిగా డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కల్యాణ్ ముందుకు రావాలన్నారు. దేశంలో 60 బౌద్ధ స్తూపాలు ఉండగా 40 స్తూపాల వద్ద కనీస వసతులు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం వద్ద నిధులున్నాయన్నారు. ఆ నిధులతో బౌద్ధ ఆరామాలను అభివృద్ధి చేయాలన్నారు.

జిల్లా నుంచి 200 మంది కాశీయాత్ర

కొత్తపేట: ఆత్రేయపురం మండలం అంకంపాలెం సనాతన ధర్మప్రచార వాగ్గేయకార సంకీర్తనా వాహిని సేవాసమితి ఆధ్వర్యంలో 200 మంది కాశీయాత్రకు బయలుదేరి వెళ్లారు. 2015 నుంచి ప్రారంభమైన సనాతన ధర్మ ప్రచార రథ యాత్ర 2027 సంవత్సరం గోదావరి పుష్కరాలకు 12 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ కాశీయాత్ర నిర్వహిస్తున్నామని రథయాత్ర నిర్వహణ కమిటీ ప్రెసిడెంట్, వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రం ఆస్థాన అన్నమాచార్య సంకీర్తనాచారి కరుటూరి వెంకట శ్రీనివాసరావు తెలిపారు. ఆత్రేయపురం మండలం అంకంపాలెం గ్రామం, తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామం నుంచి మొత్తం 200 మంది కాశీ యాత్ర ప్రయాణం మంగళవారం ప్రారంభమైందన్నారు. కాశీ క్షేత్రం కన్నప్పమఠంలో ఈనెల 6వ తేదీ 17వ తేదీ వరకు శివనామ సంకీర్తన సప్తాహ ధ్యాన మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. లోక కళ్యాణార్థం మన భారతదేశంలో నిత్యకల్యాణం పచ్చతోరణంగా ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని కాశీ క్షేత్రంలో వారణాసి కన్నప్పమఠంలో 12 రోజులు శివనామ సంకీర్తన సప్తాహ ధ్యాన మహోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. సేవా సమితి ద్వారా భక్తుల సమక్షంలో సాధువులకు అన్నదానం, వస్త్రదానం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని శ్రీనివాసరావు తెలిపారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అయినవిల్లి: ఎప్పటికప్పుడు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విలస పంచాయతీ కార్యదర్శి పి.ధనలక్ష్మి అన్నారు. మంగళవారం విలసలోని పంచాయతీ సిబ్బందితో ఆమె ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పొడి, తడి చెత్త వేరు చేసి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలన్నారు. ఇలా చేయడం ద్వారా గ్రామాల్లో దోమల ఉధృతి తగ్గుతుందన్నారు. తద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు. తడిచెత్త ద్వారా పంచాయతీకి ఆదాయ వనరులు సమకూరుతాయని ఆమె వివరించారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మామిడికుదురు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలు కృషి చేయాలని పీఆర్‌టీయూ కార్యవర్గ సమావేశం కోరింది. మామిడికుదురులో మండల శాఖ అధ్యక్షుడు యాళ్ల పల్లంరాజు అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థి డాక్టర్ గాదె శ్రీనువాసులునాయుడు ఎన్నికపై సమావేశం హర్షం వ్యక్తం చేసింది. ఉపాధ్యాయ సమస్యలపై మండలిలో పోరాడుతూ హక్కుల సాధనకు శ్రీనివాసులునాయుడు కృషి చేశారని పేర్కొంది. పీఆర్‌టీయూ మద్దతుతో ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పేరాబత్తుల రాజశేఖరం విజయం సాధించడంపై సమావేశం హర్షం వ్యక్తం చేసింది. సమావేశంలో సంఘం ప్రతినిధులు చింతా రమేష్, పెచ్చెట్టి నరసింహమూర్తి, పి.వెంకటేశ్వరరావు, వైవీ సత్యనారాయణ, ఎల్.శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా వారోత్సవాలు

రాజోలు: మహిళా దినోత్సవానికి స్వాగతం పలుకుతూ రాజోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మహిళా వారోత్సవాలను నిర్వహించారు. మంగళవారం ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫుడ్ ఎగ్జిబిషన్‌ను జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతికుమారి ప్రారంభించి తిలకించారు. తక్కువ వ్యయంతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహార పదార్థాలు తయారు చేసుకునే విధానాన్ని వివరించారు. ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మానవహారంగా ఏర్పడి మహిళా దినోత్సవానికి స్వాగతం పలికారు. సీడీపీఓ రమాదేవి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పి.గన్నవరం: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం ఐసీడీఎస్ పీఓ బి.శాంతకుమారి అంతర్జాతీయ మహిళా వారోత్సవ ర్యాలీని ప్రారంభించారు. ఆమె మహిళలనుద్దేశించి ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.విజయప్రసాద్, ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.